# నమస్తే తెలంగాణ
## మంచిర్యాల
## కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 6 ఆగస్టు 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


## పోలీస్ వాహనాలు కండిషన్లో ఉంచాలి

**అడిషనల్ అడ్మిన్ డీసీపీ రాజు**



వాహనాలను తనిఖీ చేస్తున్న అడిషనల్ డీసీపీ రాజు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 5 : పోలీస్ వాహనాలను ఎప్పటికప్పుడు పరిశీలించి కండిషన్లో ఉంచుకోవాలని రామగుండం కమిషనరేట్ అడిషనల్ అడ్మిన్ డీసీపీ రాజు అన్నారు. సోమవారం కమిషనరేట్ హెడ్‌క్వార్టర్స్‌లో మంచిర్యాల పరిధిలోని పెట్రోకార్, రక్షక్, హైవే పెట్రోలింగ్ పోలీసు వాహనాల పనితీరు, వాటి నిర్వహణను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వాహనాల నిర్వహణ లోటుపాట్లపై నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని, క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టి సమగ్ర నివేదికను నెల వారీగా సమర్పించాలని, మోటార్ వాహనాల అధికారులు, ఇతర అధికారులకు తెలియజేయాలని సిబ్బందికి సూచించారు. విధుల్లో ఉన్నపుడు యూనిఫామ్, సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అనాథలకు ఆర్థిక సాయం




నగదు అందజేస్తున్న ఎస్ఐ రాజశేఖర్, సంస్థ సభ్యులు

మందమర్రి, ఆగస్టు 5 : ఊరు మందమర్రికి చెందిన భూనేని దూనాచారి-లక్ష్మి(40) దంపతులు అనారోగ్యంతో మృతి చెందగా అనాథలైన అర్చన, అభిలాష పరిస్థితి దయనీయంగా మారింది. ఈ విషయమై గత నెల 27న ‘నమస్తే తెలంగాణ’లో నాడు తండ్రి.. నేడు తండ్రి’ శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు ఇప్పటికే పలువురు దాతలు చేయూతనివ్వగా, తాజాగా టీం పంచముఖి సంస్థ సభ్యులు అండగా నిలిచారు. సోమవారం వారి ఇంటికి వెళ్లి ఎస్ఐ రాజశేఖర్ చేతుల మీదుగా రూ. 25 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీం పంచముఖి సభ్యుడు కృష్ణ చైతన్య ఆచార్యులు, సభ్యులు పాల్గొన్నారు.

- ఇప్పటికే జీపీల భారమంతా కార్యదర్శుల పైనే..
- వచ్చిన జీతం పనులకే ఖర్చు అవుతున్నదంటున్న సెక్రటరీలు
- ఇలా అప్పులు చేస్తూ పోతే తమ బతుకులెట్లా అంటూ ఆవేదన
- సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న పంచాయతీలు

# ‘స్వచ్ఛదనం-పచ్చదనం’కు ధన మెట్లా?

**కార్యక్రమం నిర్వహణకు నిధులివ్వని సర్కారు**



కోటపల్లి మండలం బొప్పారం గ్రామ పంచాయతీలో మూలకు పడ్డ ట్రాక్టర్ ట్రాలీ



చింతలమానపల్లి మండలం గంగాపూర్ గ్రామ పంచాయతీ ఎదుట నిలిచిన మురుగు నీరు



మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలకేంద్రంలో పేరుకుపోయిన చెత్త

మంచిర్యాల, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వం ‘స్వచ్ఛదనం-పచ్చదనం’ కార్యక్రమానికి నిధులివ్వకపోవడం అధికారులను అయోమయానికి గురి చేస్తున్నది. ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయగా, పైసల్లేకుండా పనులెట్లా చేసేదని వారు తలలు పట్టుకుంటున్నారు. జనవరితో సర్పంచ్‌ల పదవీకాలం పూర్తికాగా, ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించిన విషయం విదితమే. కానీ, గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించకపోవడంతో పరిపాలన గాడి తప్పి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. నిర్వహణ భారం మొత్తం పంచాయతీ కార్యదర్శులపైనే మోపడంతో ఏం చేయాలో తెలియక వారు సతమతమవుతున్నారు. జిల్లా నుంచి మొదలుకొని.. మండల స్థాయి అధికారులు వరకు ప్రతి పని పంచాయతీ కార్యదర్శులకే అప్పగించడంతో ఎటూ పాలుపోలేని దుస్థితి నెలకొంది. గత కేసీఆర్ సర్కారు పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా ముందస్తుగానే నిధులు విడుదల చేయడంతో ఎలాంటి కార్యక్రమాన్ని అయినా సక్రమంగా నిర్వహించారు. ప్రస్తుత ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుండగా, కార్యక్రమాల నిర్వహణపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

### పడకేసిన పారిశుధ్యం

కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీలకు ఎలాంటి నిధులు కేటాయించకపోవడంతో పారిశుధ్యం పడకేసింది. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిపప్పటి నుంచి గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదు. పంచాయతీలకు ఏడు నెలలుగా ఒక్క రూపాయి కూడా రావడం లేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నిధులు విడుదల చేసి, వాటిని పంచాయతీ కార్మికుల వేతనాలకు కేటాయించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆ నిధులు వారి వేతనాలకే సరిపోయాయి. ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో పైసలు లేకపోవడంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారుతోంది. పెద్ద జీపీలు ఎలాగో నెట్టుకువస్తున్నా, చిన్న పంచాయతీల్లో మాత్రం సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయి. ఇక పంచాయతీలకు కేటాయించిన ట్రాక్టర్లకు ఈఎంఐలు కట్టకపోవడంతో, కార్యదర్శులకు బ్యాంక్‌ల నుంచి నోటీసులు వస్తున్నాయి. గ్రామ పంచాయతీల్లో ప్రతి రోజూ చెత్త తీసుకెళ్లే ట్రాక్టర్లలో డీజిల్ పోయించేవారు లేక అవి మూలన పడ్డాయి. కొన్ని గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు అప్పులు చేసి కొన్ని నెలలు వాటిని నడిపించగా, ఆ అప్పులు కుప్పలై మళ్లీ అప్పు పుట్టకపోవడంతో వారు కూడా చేతులెత్తాశారు. దీంతో గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులు ముందుకు సాగగా, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పంచాయతీలు అపరిశుభ్రతకు కేరాఫ్‌గా మారుతున్నాయి.

### జీతాలు పంచాయతీలకే

కార్యదర్శులు వారి జీతాలను గ్రామ పంచాయతీలకే వెచ్చిస్తున్నారు. పైగా అప్పులు కూడా చేయాల్సి వస్తోంది. ప్రతి పనికీ పంచాయతీ కార్యదర్శులనే బాధ్యున్ని చేయడం, ప్రభుత్వం రూపాయి కూడా కేటాయించకుండా పనులు చేయమనడం, దీనికి తోడు జిల్లా, మండల స్థాయి అధికారులు కూడా పంచాయతీ కార్యదర్శులపైనే భారం వేయడం వల్ల అప్పులు చేయాల్సి వస్తుంది. ఇప్పటి వరకు పంచాయతీలకు ఎలాంటి నిధులు రాకపోవడంతో ప్రతి నెలా తమ జీతంతో పాటు అదనంగా మరో రూ. 20 వేల నుంచి రూ. 30 వేల దాకా అప్పులు తెచ్చి పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇవేమీ సరిపోనట్లు తాజాగా ‘స్వచ్ఛదనం-పచ్చదనం’ పేరిట మరో పెనుభారం మోపుతుండడంతో ఈ కార్యక్రమాన్ని నిధులు లేకుండా ఎలా నిర్వహించాలని ప్రశ్నిస్తున్నారు. ఈ కార్యక్రమ నిర్వహణ కోసం ప్రతిదానికి నిధులు అవసరం ఉండగా తమకు అప్పులు ఎవరు ఇస్తారని, ఇలా అప్పులు చేస్తూ పోతే తమ జీవనం ఎలాగని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పులిపాదముద్రలను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

## గోవింద్‌పూర్ సమీపంలో పులి సంచారం

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 5 : మండలంలోని గోవింద్‌పూర్ పరిసర ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్లు అధికారులు ధ్రువీకరించారు. జిల్లా కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో నున్న గోవింద్‌పూర్‌లోని పంట చేలల్లో సోమవారం సాయంత్రం పులి అడుగులు కనిపించగా, గ్రామస్తులు అధికారులకు సమాచారం అందించారు. జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్‌కుమార్, ఆసిఫాబాద్ సీఐ సతీశ్ స్పందించి, డిప్యూటీ రేంజ్ అధికారి యోగేశ్, ఏఎస్ఐ రాము, కానిస్టేబుల్ సందీప్‌ను అక్కడికి పంపించారు. వారు పరిశీలించి పులి అడుగులుగా ధ్రువీకరించారు. గ్రామస్తులు రాత్రి వేళల్లో బయట తిరగకూడదని సూచించారు.



బాధ్యతలు స్వీకరించిన దత్తారావ్

## జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిగా బానోత్ దత్తారావ్

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 5 : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారిగా బానోత్ దత్తారావ్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ అధికారులతో కలిసి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

## అసెంబ్లీలో సమస్యలపై గొంతెత్తాలి

- సామాజిక కార్యకర్త భూమాచారి డిమాండ్
- రోడ్డుపై బైఠాయించి ప్లకార్డుల ప్రదర్శన

జన్నారం, ఆగస్టు 5 : మండల సమస్యల పరిష్కారం, అటవీశాఖ ఆంక్షలు ఎత్తి వేతపై అసెంబ్లీలో గొంతెత్తాలని డిమాండ్ చేస్తూ సామాజిక కార్యకర్త భూమాచారి సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళనకు దిగాడు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసేందుకు ఎంపీడీవో కార్యాలయానికి వెళ్తున్నాడని తెలుసుకొని రోడ్డుపై బైఠాయించారు. సమస్యలపై ప్లకార్డుల ప్రదర్శించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు వేరే మార్గం గుండా ఎమ్మెల్యేను పంపించారు. అనంతరం ఎస్ఐ రాజవర్దన్ భూమాచారి వద్దకు చేరుకొని ఆందోళన విరమింపజేశారు. సమస్యలుంటే విన్నవించాలని, ఇలా రోడ్డుపై ఆందోళన చేయడం సరికాదని, మరోసారి ఇలా చేస్తే కేసు నమోదు చేస్తామని చెప్పారు.




ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే దారిలో నిరసన తెలుపుతున్న సామాజిక కార్యకర్త భూమాచారి



గేటు ముందు బైఠాయించిన విద్యార్థినులు

## ఈ హెచ్ఎం మాకొద్దు

**జైనూర్‌లో గిరిజన హాస్టల్ విద్యార్థినుల ఆందోళన**

జైనూర్, ఆగస్టు 5 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహంలో రెండు రోజుల క్రితం బాధ్యతలు చేపట్టిన హెచ్ఎం పార్వతి తమకు వద్దంటూ విద్యార్థినులు సోమవారం ఆందోళన చేపట్టారు. గేటు ముందు బైఠాయించి ఇప్పటి వరకున్న ఇన్‌చార్జి హెచ్ఎం సోనేరావ్‌నే తిరిగి కొనసాగించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవరావ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మెస్రం ఆంబాజీరావ్ పాఠశాలను సందర్శించి విద్యార్థినులను సముదాయించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టకున్నా, ఇతరాత్ర మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం చేసినా ఉపేక్షించబోమన్నారు. హెచ్ఎం వద్దంటూ ఆందోళనకు దిగడం సరికాదని పిల్లలకు నచ్చజెప్పి తరగతి గదులకు పంపించారు.

### పాఠశాలను సందర్శించిన డీడీ

హెచ్ఎం మాకొద్దంటూ ఆందోళనకు దిగిన విషయం తెలుసుకున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా డీడీ రమాదేవి పాఠశాలను సందర్శించారు. విద్యార్థినులు ఆందోళనకు దిగడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బోధన సిబ్బంది, వర్కర్లు విధి నిర్వహణలో సమయపాలన పాటించాలన్నారు. విద్యార్థినులు క్రమ శిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. అకారణంగా పిల్లలను ఎవరైనా రెచ్చగొడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# హైవేకు భూములియ్యం..

- లక్షెట్టిపేటలో ఎన్‌హెచ్ ప్రజాభిప్రాయ సేకరణలో రైతుల స్పష్టం
- లాక్కోవాలని చూస్తే చావేనంటూ కంటతడి
- గ్రామ సభలు నిర్వహించి పరిహారంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్
- సభా ప్రాంగణంలో బైఠాయింపు
- గతంలో చేపట్టిన సర్వే ఎందుకు క్యాన్సిల్ చేశారంటూ నిలదీత
- ఎట్టి పరిస్థితుల్లో భూములిచ్చేది లేదంటూ ఆర్డీవోకు వినతి



అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు అభిప్రాయాలు అందజేస్తున్న రైతులు



అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో మాట్లాడుతున్న రైతులు

లక్షెట్టిపేట, ఆగస్టు 5 : ఆర్మూర్ నుంచి మంచిర్యాల వరకు చేపట్టనున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేకు భూములియ్యమని, బలవంతంగా లాక్కోవాలని చూస్తే ఊరుకునేది లేదని రైతులు తెగేసి చెప్పారు. సోమవారం పట్టణంలోని ఎస్పీఆర్ గార్డెన్స్‌లో నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతీలాల్ అధ్యక్షతన పర్యావరణంపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. లక్షెట్టిపేట, దండేపల్లి, హాజీపూర్, మంచిర్యాల, మందమర్రి మండలాల్లో భూములు కోల్పోతున్న రైతులను పిలిచి అభిప్రాయాలు సేకరించారు. హైవేలో ఎవరిది ఎంత భూమి పోతుందని, ఎంత పరిహారం ఇస్తారన్న అంశంపై చర్చిస్తారనుకున్న రైతులను.. హైవే నిర్మాణం చేపడితే పర్యావరణం ఎలా ఉంటుందో చెప్పాలంటూ అధికారులు ప్రశ్నించడంతో వారు అవాక్కయ్యారు. ఇప్పటికే ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణ సమయంలో విలువైన భూములు లాక్కున్నారని, అప్పుడు ఇచ్చిన అరకొర పైసలు తమకు అక్కరకు రాలేదని, మళ్లీ ఇప్పుడు హైవే కోసం భూములు లాక్కోవాలని చూడడం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నించారు. తమ భూములు పోతే చావేనంటూ కంట తడి పెట్టారు. సమావేశానికంటే ముందు గ్రామ సభలు నిర్వహించి ఎంత భూమి పోతుంది.. ఎంత పరిహారం వస్తుంది.. రైతుకు సమ్మతమేనా అని తెలుసుకున్నాకే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. గతంలో ఇదే హైవే కోసం చేసిన సర్వేను ఎందుకు క్యాన్సిల్ చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ప్రస్తుతమున్న రోడ్డును వెడల్పు చేయడంతో పాటు పట్టణ ప్రాంతాల్లో ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మిస్తామని చెప్పి.. అంతా సిద్ధం చేసి మళ్లీ ఇప్పుడు సర్వే ఏమిటని నిలదీశారు. తమ భూములు ఎట్టి పరిస్థితుల్లో ఇచ్చేది లేదంటూ సుమారు 100 మంది రైతులు తమ అభిప్రాయాలతో కూడిన వినతిపత్రాలను ఆర్డీవోకు అందజేశారు. అంతే గాకుండా రైతులకు భూ పరిహారంపై స్పష్టత ఇవ్వాలంటూ నినాదాలు చేస్తూ సభా ప్రాంగణంలో బైఠాయించారు. జాయింట్ కలెక్టర్ మోతీలాల్ కలగజేసుకొని రైతులు ఇచ్చిన ఫిర్యాదులు మొత్తం అధికారుల దృష్టికి తీసుకుపోయి న్యాయం చేస్తానని చెప్పడంతో రైతులు శాంతించారు. ఆర్డీవో రాములు, ఎన్‌హెచ్ నిజామాబాద్ జిల్లా ఈఈ వంశీకృష్ణ, పీడీ అజయ్ మణికుమార్, ఎన్‌హెచ్ ఇన్‌చార్జి తహసీల్దార్ సత్యనారాయణ, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యముంటేనే విజయం

**మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**

లక్షెట్టిపేట,ఆగస్టు 5 : ప్రజల భాగస్వామ్యముంటేనే ఏ కార్యక్రమమైనా విజయవంతంగా పూర్తి చేయగలుగుతామని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం వెంకట్రావుపేట గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ పల్లెలు పచ్చదనంతో ఉంటేనే రాష్ట్రంతో పాటు దేశం కూడా బాగుంటుందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం, వనమహోత్సవంపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది, అధికారులు, విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి స్వప్న, ఎంపీడీవో సరోజ, డీఎల్పీవో దర్మారాణి, ఎంపీవో శ్రీనివాస్, ఏపీవో వెంకటరమణ, పంచాయితీ సెక్రటరీ వంశీకృష్ణ పాల్గొన్నారు.



వెంకట్రావుపేట గ్రామంలో స్వచ్ఛదనం - పచ్చదనం ర్యాలీలో పాల్గొన్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



ఆసిఫాబాద్: అడ గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

### మొక్కలు నాటడం అందరి బాధ్యత

**ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 5 : స్వచ్ఛదనం-పచ్చదనం అనేది నిరంతర ప్రక్రియ అని, మొక్కలు నాటి పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. సోమవారం ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ఆర్ కాలనీలో మున్సిపల్ కమిషనర్ భుజంగరావు అధ్యక్షతన నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్‌తో కలిసి హాజరయ్యారు. మొక్కలు నాటిన అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసుకొని ముందుకు సాగి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అడ గ్రామపంచాయతీలో డీపీవో భిక్షపతి, డీఆర్డీవో, ఎంపీడీవో శ్రీనివాస్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..

ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679